**కథానిక**

# "అర్థం"

పలాది వెంకట కృష్ణమూర్తి

"మీరెక్కడ పనిచేస్తున్నారు?" అడిగాడాయన.

"స్టేట్ బేంక్ లో" చెప్పాడా యువకుడు.

"మీ వయసు?"

"ఇరవై నాలుగు."

"జీతం?"

అతను క్లర్క్ స్కేల్ చెప్పాడు బేసిక్, డి.ఏ., హెచ్ ఆర్.ఏ. వగైరా వివరాలతో.

"మా బ్యూరో గురించి వివరంగా తెలుసా?"

తల అడ్డంగా వూపాడా యువకుడు.

"ఆంధ్ర దేశంలో పెళ్ళికావల్సిన యువతీ యువకుల చిరునామా లన్నీ మావద్ద చాలా వరకు వున్నాయి. కొన్ని వేల చిరునామాలు. క్వాలిఫికేషన్స్ బట్టి, అంటే వుద్యోగం, జీతం, వయసు, నివసించే ప్రాంతం, కులం, గోత్రం, బరువు, ఎత్తు, రంగు, కుటుంబ వివరాలు, కట్నం—ఇలా అనేక వివరాలు గల ఇండెక్స్ కార్డ్స్‌తో కొన్ని సెట్స్ తయారు చేసాం. 'ఫలానా రకం పెళ్ళికూతురు లేదా పెళ్ళికొడుకు' కావాలని అడిగితే, అయిదారు నిముషాల్లో అలాంటి అర్హత లున్నవారి చిరునామా ఇవ్వగలం. నూటికి తొంభై పాళ్ళు—మేం సూచించే సంబంధం కుదురుతుంది తప్పకుండా. ఆంధ్ర దేశంలోని పెళ్ళికొడుకులని, పెళ్ళికూతుళ్ళని కలిపేందుకు ఈ బ్యూరో నడుపుతున్నాం. పెళ్ళి కావల్సిన వారి సదుపాయం కోసం ఇది స్థాపించబడ్డది కాని, బ్యూరోకి లాభాలు సంపాదించి పెట్టాలని కాదు. రిజిస్ట్రేషన్ ఫీజ్ క్రింద కేవలం రెండు రూపాయలు తీసుకుంటాం. మేం ఇచ్చే అప్లికేషన్‌లోని వివరాలన్నీ నింపి ఇస్తే చాలు."

"ఆ సంగతి విని మీ దగ్గరకి వచ్చాను."

"మీరు మీ పేరు పెళ్ళికొడుకుల జాబితాలో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలనే ఉద్దేశంతో వచ్చారా?"

"కాదు. పెళ్ళికూతురు చిరునామా తీసుకోడానికి వచ్చాను. త్వరలో పెళ్ళిచేసుకుందామనే నిర్ణయానికి వచ్చాను."

"మరి [illegible] ంగా మా దగ్గర వున్న రెండు జాబితాలూ—అదే 'వధువు, వరుడు' జాబితాలు చూపి, మేమే కుదురుస్తుంటాం సంబంధాలు. పెళ్ళికూతురు ఎలా వుండాలో వివరంగా చెప్పండి."

"అంటే?"

మృదువుగా నవ్వాడా వృద్ధుడు.

"ఆల్ రైట్. నేనడిగే ప్రశ్నలకి సమాధానాలు ఇవ్వండి చాలు. మీక్కావల్సిన పెళ్ళికూతుర్ని నేనే మీకు ఎన్నిక చేస్తాను. సరేనా?"

"అలాగండి."

"అలా కూర్చోండయితే. పెళ్ళికూతురు వయసు ఎంతలో వుండాలి?"

ఆ యువకుడు ఓసారి బ్యూరో ఆఫీస్ గదిలోని ఇండెక్స్ కార్డ్స్ కట్టలవంక చూశాడు. వేలకొద్దీ కార్డులున్నాయి. అందులోంచి ఓకార్డు తీస్తాడను బహుశ, కనిపెట్టి.

"పదహారు" చెప్పాడు.

జవాబులు పెన్సిల్‌తో నోట్ చేసుకుంటూ అడగసాగాడా వృద్ధుడు.

"చదువు?"

"ఎస్సెసెల్సీ లేదా దానికి సరయినచదువు."

"పెళ్ళయాక చదువుకో వచ్చా?"

"ఊహూ"

"ఉద్యోగం?"

"ఊహూ"

"కులం"

"బ్రాహ్మలు"

"శాఖ"

"వైదీకులు"

"రంగు?"

"ఎరుపు. లేదా తెలుపు. లేదా పసుపు. నలుపు మాత్రం కాదు."

"అత్త మామలుండాలా, వద్దా?"

"ఉండాలి."

"మామ గారి జీతం 500? 750? 1000?"

"నెలకి 1000"

"మరదళ్ళు?"

"ఒకరిద్దరున్నా పర్వాలేదు."

"ఆస్తి? మామ గారికి పది వేలుండాలా? ఏభై వేల ఆస్తి వుండాలా? లక్ష?"

"లక్షకి పైన ఎంతయినా పర్వాలేదు. ఎప్పుడైనా పండగలకి పిలిచి, మంచి బట్టలు పెట్టి సారెలు, పురుడు. పుణ్యాలు చేయించే ఆర్థిక బలం అవసరం."

"ఏ ప్రాంతం వాళ్ళు?"

"విజయవాడ, గుంటూరు, తెనాలి...."

"కట్నం ఇచ్చే ఆదర్శం వున్న వాళ్ళా? అసలు కట్నమే ఇవ్వకూడ దనుకొనేవాళ్ళా?"

"కట్నం ముఖ్యం"

"ఎంత? 5000? 10,000? 15,000?"

"పదిహేనూ ఇరవై మధ్య."

"తగ్గితే ఆ మేరకు స్కూటర్ లాంటివి కొనివ్వచ్చా?"

"దానికి అభ్యంతరం లేదు."

"కొడుకు ఉండాలా? అంటే బావమరదులు."

## అక్షరాంజలి!

కె. రాజేశ్వరరావు

ము(ద్రారాక్షసుడవన్న
ముద్దు పేరు నీకిస్తూ
ఎందరో మేధావులు నీ
ఘనతను కీర్తించినారు
అక్షరాల కూర్పరీ!
బహు చక్కని నేర్పరీ!!
నీకన్నా కవిగాడి
లోకంలో ఎవడయ్యా?
మహాకవులు సైతం నీ
మహిమకు
తలవంచుతారు
రక్షక భటువర్గాలను
భక్షకులను చెయ్యగలవు
భూతల స్వర్గం సైతం
భూతాలకు నిలయంగా
నీతులు చెప్పే నేతల
పీతలుగా మలచగలవు
అధునాతన శబ్దసృష్టి
కధిపతివిక నీవేగా!
కాకుంటే ప్రూఫ్ రీడర్
కసిగా నీ కవనానికి
కలం పోట్లు పొడుస్తాడు
(అతగాడు ఒకోసారి
నీ ఘనతను
మించవచ్చు!)
అక్షరాల కూర్పరీ!
బహు చక్కని నేర్పరీ!!
నమ్మలేని అబద్ధాన్ని
నాజుగ్గా కూర్చలేక
అక్షరాలు మార్చానని
తప్పు పట్టలేను నిన్ను!
'స్లిప్పు'లా, టిజీ తాన
జీతాల 'సెటిలింగు రూలు'
చిన్నదిగా వుందంటూ
ఖిన్నుడవై పోకయ్యా!
కోర్కెల 'కంపోజి'న ప్ర-
త్యక్షరమూ 'రాంగు
ఫాంటు'
వస్తువులతో నిండు
(బతుకు
'హాఫ్ బాడీ'లా వుందని
'వాంటింగు'ల 'ఓ.టి.'
లకు
వాపోయే నా నేస్తం!
అవసరాలు తీరేందుకు
అలవెన్సుల 'సైడు స్పేసు'
అడిగినంత మాత్రానికి
అరచేతికి అందబోదు
తెగబడి నిలబడి పోరే
తెగువను చూపకపోతే
నీ జీవిత కావ్యానికి
కంపోజిక పూర్తి కాదు!

"కొడుకులు లేనివాళ్ళు అయితే బెటర్"

"అమ్మాయి మోడ్రన్‌గా వుండాలా? లేక తులసి పూజలు చేసుకొనే విధంగా వుండాలా?"

"పూజలు చేస్తూనే, మోడ్రన్‌గా వుండాలి"

"కుటుంబ నియంత్రణం అమలు జరిపే ఆలోచన వుంటే, ఆపరేషన్ ఆమె చేయించుకోవాలా లేక మీరా?"

"ఆ అమ్మాయే."

"... ...."

"ఇంకా అడగండి"

"చాలా టిపికల్ కేస్ ఇది. మా దగ్గర ఓ ఆల్బం వుంది. అందులో ఇలాంటి అమ్మాయి వుందేమో చూస్తానుండండి" అని టేబిల్ మీద ఆల్బం తిప్పిచూసి నిట్టూర్చాడాయన.

"చూడండి" అందించాడు ఆల్బం.

ఆ ఆల్బంలో పేజీలు ఒకటొకటిగా తిప్ప సాగాడు. అనేక మంది కన్నె పిల్లల ఫోటోలు.

ఆల్బం ఆఖరి పేజీలో ఓ అద్దం వుంది. ఆ వృద్ధుడు గలగలా నవ్వి అన్నాడు యువకుడితో

"మీరు కోరుకొన్నలాంటి అమ్మాయయితే లేదు గాని, అలాంటి వరుడున్నాడు ఆ పేజీలో."

"అద్దం వుంది ఈ పేజీలో?" ఆశ్చర్యంగా అన్నాడు ఆ యువకుడు.

"మీరు చెప్పిన అర్హతలున్న అమ్మాయిని కోరుకునే వరుడికి తప్పకుండా అలాంటి అమ్మాయిని చేసుకునే అర్హత ఉండాలని ఒప్పుకుంటారా?" అడిగాడా వృద్ధుడు.

"ఉండాలి"

"అలాంటి వరుడి బొమ్మ ఇప్పుడా పేజీలో వుందా? ఉంటే చూసి చెప్పండి."

ఆల్బంలో, ఆఖరు పేజీలోని అద్దంలోని తన ప్రతిబింబం వెక్కిరించినట్లుగా అనిపించిందతనికి.

మళ్ళీ గలగలా నవ్వాడా వృద్ధుడు.

## తలకంటే టోపీకి ఎక్కువ వెల కడితే

*(ఒక సోవియట్ జానపద కథ)*

ఓ భార్యాభర్తల మధ్య వాగ్వివాదం చెలరేగింది. ఉగ్రుడై పోయిన భర్త కొరడాతో భార్యకో పాఠం నేర్పాలనుకొని చేయి పైకెత్తాడు.

"ఏటు వెయ్యి తెలుస్తుంది! నేను దిక్కూ మొక్కూ లేని అనాధననుకోకు?" ఆమె అందామె.

"అబ్బో" భర్త అన్నాడు. భార్య ధైర్యంగా ఎదురు జవాబిచ్చినందుకు ఆశ్చర్యపోతూ, చచ్చిన నీ బంధువులు తిరిగి బ్రతికి వచ్చినట్లుగా నేనెక్కడా విన్నట్లు నాకు జ్ఞాపకం రావటం లేదే! నీకు సాయం ఎవరొస్తారనుకుంటున్నావే?"

"సోవియట్ అధికారుల్తో చెబుతాను!"

ఆ రోజు సాయంకాలం పొద్దుండగా తలకు టోపీ ధరించిన ఆ మనిషి రచ్చబండ మీద ఫిర్యాదు చేశాడు :

"చాలా విషయల్లో నేను సోవియట్ ప్రభుత్వంతో ఏకీభవిస్తాను. గౌరవనీయులైన పెద్దలారా, కానీ అది స్త్రీలకు సమాన హక్కులిచ్చిందనే విషయాన్ని అంగీకరించడానికి నా మనసొప్పడం లేదు. ఈ రోజు భార్య గౌరవం కావాలంటుంది, రేపు ప్రేమ కావాలంటుంది, ఆ మరురోజు "నీవు నన్ను నీ చేతుల్లో కెత్తుకొని తిరుగు" అంటుంది. ఆ తర్వాతిదంతా మీకు తెలిసిరాక ముందే మీ మీద స్వారీ చేస్తుంది. సోదరులారా, యిదంతా భరించడం నా వల్ల కాదు!"

అంతే. ఆ మనిషి ఓ పెద్ద కొండ శిఖరమెక్కి ఓ లోయలోకి దూకేశాడని వాళ్ళు చెబుతుంటారు. అప్పుడే ఆ కొండల్లో ఓ నానుడి పుట్టింది. "తలకంటే టోపీకి ఎక్కువ వెలకడితే [illegible]" అని.